కథ

# ఓ తల్లి ఆవేదన

—రాఘవి

**ఉదయం నుంచి వసుంధర మనసు చేదు తిన్నట్టుగా వుంది. తన కోడలు స్వప్న ప్రవర్తన ఎప్పుడూ ఆమెకు బాధ కలిగిస్తూ వుంటుంది. ఆ రోజు ఒంట్లో కాస్త నలతగా వుండటం వల్ల పడుకుని వుంది. అప్పుడు స్వప్న టిఫిన్ తినమంటే తనకి ఏమీ తినబుద్ధి కావడం లేదని చెప్పింది.**

"మీరిలా ఉపవాసాలు చేస్తే మీకు మేము తిండి పెట్టడం లేదేమోనని అందరూ మమ్మల్ని అనుకుంటారు. ఆపై మీరు మంచం పడితే చాలా కష్టం" అంది. ప్రతి చిన్న విషయానికీ స్వప్న ఏదో అంటూ వుంటుంది. ఆ మాటలు వసుంధరకు కష్టం కలిగిస్తాయి. ఇంతలో తన కొడుకు పవన్ వచ్చాడు.

"అమ్మా! టిఫిన్ తిన్నావా?" అంటూ. ఆఫీసులో ఫస్ట్ అటెండ్ అయినవారికి ఇచ్చే బహుమతి ఏదో అందుకోవాలన్నట్టు హడావిడిగా వెళ్ళిపోయాడు. తన కోడలు ఈ విషయం చెప్పి వుండదు. లేకపోతే "అమ్మా! ముందు నువ్వు తింటే ఆరోగ్యం అదే బావుంటుంది" అంటూ సమర్ధిస్తాడు. ఏ మాటన్నా అంటే ఎదుటి వారి మనసు గాయపడుతుందేమోనని అనుకునే మనస్తత్వం కాదు స్వప్నది. ఇంకా అత్తగారు తమకు అడడుగా వుందనే భావనలో వుంటుంది. అలా ఏ మాటన్నా అన్న రోజు వసుంధర డల్‌గా వుంటుంది. స్వప్న అలా అంటుంటే మొదట్లో పవన్ మందలించాడు. ఆ తర్వాత నుంచి పట్టించుకోవటం మానేశాడు. వసుంధర కూడా ఏ విషయాలూ పవన్‌కి చెప్పదు. ఆహార విషయంలో స్వప్న ఏం పెడితే అదే తింటుంది. 'అవి కావాలి, ఇవి కావాలి' అని ఎప్పుడూ అడగదు. ఒక్కోసారి తన భర్త గుర్తుకు వస్తే హృదయం భారంగా మూలుగుతుంటుంది. తన భర్త రాజగోపాలరావు బ్రతికి వున్నప్పుడు తను రాణిలా దర్జాగా బ్రతికింది. అకారణంగా ఒక్కోసారి ఆయన ఏమన్నా అంటే తను ఒప్పుకునేది కాదు. తన ఆత్మ గౌరవానికి భంగం కలిగించే ఏ సంఘటనైనా సహించేది కాదు. చిన్నప్పటి నుంచి ఎవరినీ ఒక మాట అనకుండా, ఎవరి చేతా తను మాట పడకుండా ప్రవర్తించింది. తల్లిదండ్రుల దగ్గర గారాబంగా మసలుకొంది. అలాంటిది స్వప్న చేత మాటలు పడటం తన విధి రాత అనుకుంటూ బాధపడుతూ వుంటుంది. వసుంధరకు కొడుకు, కూతురు. కూతురు విజయవాడలో వుంటుంది. కూతురు సాహితి వసుంధరకు ఉత్తరాలు రాస్తూ యోగక్షేమాలు కనుక్కుంటూ వుంటుంది. తన దగ్గర వచ్చి వుండమని ఎప్పుడూ తల్లిని ఉత్తరాల్లో పోరుతూంటుంది. అయితే కూతురు దగ్గరకు వెళ్ళాలంటే ఆమెకు గిల్టీగా వుంటుంది ఎందుకో.

స్వప్న చేతల వల్ల మనస్తాపం కలిగినప్పుడు వసుంధరకు కూతురు దగ్గరకు వెళ్ళాలని వుంటుంది. కాని తరతరాల నుంచి తల్లిదండ్రులు కొడుకు దగ్గర వుండాలనే సంప్రదాయం వలన, కూతురు దగ్గర వుంటే ఎదుటివారు చులకనగా చూస్తారనే భావం వలన ఏమో! తను ధైర్యం చేయలేకపోయింది.

వసుంధర ఇంటి పక్క పోర్షన్‌లోకి ఎవరో కొత్తవాళ్ళు వచ్చి దిగారు. అతనికి బ్యాంకులో ఉద్యోగమని, వాళ్ళకి ఇద్దరు పిల్లలని, అతని అత్తగారు కూడా వాళ్ళ దగ్గరే వుంటారనే సమాచారం పవన్‌కి చెబుతుంటే వినబడింది వసుంధరకు. నెమ్మది నెమ్మదిగా స్వప్న వాళ్ళింటికి వెళ్ళటం, ఆవిడ ఇక్కడకు రావటంతో బాగా పరిచయం అయ్యింది. ఒకసారి స్వప్న ఆ తల్లీ కూతుళ్ళిద్దర్నీ తమ ఇంటికి ఆహ్వానించింది. వాళ్ళు వచ్చే సమయానికి వసుంధర పడుకుని వుంది. వసుంధరను చూపించి "మా అత్తగారు" అని పరిచయం చేసింది స్వప్న. ఆ మాటతో మెలకువ వచ్చిన వసుంధర వారిని చూసి లేచి కూర్చుంది. పలకరింపుగా నవ్వింది. ఆ బ్యాంకాయన అత్తగారి పేరు అన్నపూర్ణ. ఆవిడ చనువుగా వచ్చి వసుంధర మంచం మీద కూర్చుని—

"వంట్లో బాగా లేదాండీ!" అంది.

"కాస్త తలనొప్పిగా వుందంతే!" బదులిచ్చింది వసుంధర.

కాసేపు మాట్లాడి వెళ్ళిపోయారు వాళ్ళు. అప్పటి నుంచి వసుంధరకు, అన్నపూర్ణకు స్నేహం బాగా పెరిగింది. ఎక్కువగా అన్నపూర్ణే వసుంధర దగ్గరకు వచ్చి మాట్లాడుతూ వుంటుంది. ఎప్పుడోగాని వసుంధర వాళ్ళింటికి వెళ్ళదు. అలా వెళ్ళినప్పుడు తల్లీ కూతుళ్ళ ప్రవర్తన చూసి వసుంధర చాలా ముచ్చట పడుతూ వుంటుంది. ఇద్దరూ ఎప్పుడూ సరదాగా వుంటారు. అన్నపూర్ణ కూతురుకి పనిలో చేదోడు వాదోడుగా వుంటుంది. ఎప్పుడైనా తను స్వప్నతో ఆత్మీయంగా మాట్లాడినా వుల్లవిరువుగా సమాధానమిస్తుంది. 'అసలు స్వప్న తన గురించి ఎందుకు ఆలోచించదు? ఎందుకు ఆత్మీయంగా మాట్లాడదు? నేనూ తల్లి లాంటి దాన్నేనని ఎందుకు భావించదు?' ఎన్నాళ్ళ నుంచో తనలో గూడు కట్టుకున్న ఆవేదన ఒక్కసారిగా పొంగింది వసుంధరకు. అన్నపూర్ణ ఈ విషయాన్ని త్వరలోనే గ్రహించింది. ఎప్పుడూ వసుంధర ముభావంగా వుండడానికి కారణం అర్థమయింది. ఒక రోజు అన్నపూర్ణ—

"మీ కోడలు మిమ్మల్ని సరిగ్గా చూసుకుంటుందా?" అని అడిగింది. అలా హఠాత్తుగా అడిగే సరికి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు వసుంధరకు.

"అబ్బే అలాంటిదేమీ లేదు" అని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించింది.

"ఇంకా మీరు దాచాలని చూస్తారేమిటి? నేనే మొన్న మీ కోడలు మిమ్మల్ని అంటుంటే విన్నాను" అనేసరికి మాట్లాడలేకపోయింది వసుంధర.

"సాధారణంగా చాలా కుటుంబాల్లో జరిగే వ్యవహారాలే ఇవి. కాని ఆ దేవుని దయ వల్ల నాకా పరిస్థితి ఎదురు కాలేదు" అందావిడ.

"మీకు అబ్బాయిలు లేరా?

"ఉన్నారు. ఇద్దరు. కాని మా అమ్మాయి శిరీష దగ్గరే వుంటాను" అంది అన్నపూర్ణ.

"అబ్బాయిల దగ్గరకు వెళ్ళరా? అడిగింది వసుంధర.

"నేనే కాదు. మా అమ్మ, అమ్మమ్మ తరాల నుంచి మేము అమ్మాయిల దగ్గరే వుంటున్నాం".

అన్నపూర్ణ సమాధానం వింతగా తోచింది వసుంధరకు.

"ఏదైనా శుభ కార్యాలు జరిగినా రెండు రోజులు వుండి వచ్చేస్తుంటాను" అంటూ ఫ్లాష్ బ్యాక్ పూర్తి చేసింది అన్నపూర్ణ.

వసుంధర ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. ఆవిడ మళ్ళీ కొనసాగించింది.

"కొడుకులంతా దుర్మార్గులని అనను. కాని వాళ్ళకు తమ భార్యను, అమ్మను సమాధానపర్చటం తెలియదు. వాళ్ళ మధ్య సమన్వయం ఏర్పర్చటం అంతకంటే తెలియదు. భార్య చెప్పినా తలాడిస్తారు. తల్లి చెప్పినా తలాడిస్తారు. ఎటూ తేల్చలేరు. ఎవరి మాట వింటే ఎవరికి కోపం వస్తుందో తెలియక 'నడుమ మురారి'లా నలిగిపోతుంటారు. కాని అదే పిల్లాడు తన తల్లినీ, భార్యనూ సమాధానపర్చటం తెలిస్తే ఆ ఇల్లు ఎంతో ప్రశాంతంగా వుంటుంది"అంది అన్నపూర్ణ.

ఆ తర్వాత నుంచి ఈ విషయమై ఆలోచించసాగింది వసుంధర. తన గదికి వచ్చి పడుకున్న

వసుంధరను ఆలోచనలు తొలుస్తున్నాయి. రెండు రోజుల క్రితం కూతురు దగ్గర్నుంచి వచ్చిన ఉత్త రాన్ని పదేపదే చదువుకున్న ఆమె ఒక దృఢ నిశ్చయానికి వచ్చింది.

మర్నాడు పవన్ టిఫిన్ చేస్తుండగా "నేను సాహితి దగ్గరకు వెళ్దామనుకుంటున్నాను. ప్రయా ఆనికి ఏర్పాట్లు చేయి" అని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది. తల్లి హఠాత్తుగా అలా అనే సరికి పవన్‌కి ఆశ్చర్యం వేసింది. తన చెల్లి ఎప్పుడూ వాళ్ళమ్మను తమ వూరు తీసుకెళ్ళడానికి ప్రయత్నిస్తూ వుంటుంది. అక్కడకు వెళ్ళడానికి ఇష్టపడని అమ్మ ఇప్పుడు ఆలా అనేసరికి పవన్‌కి అయోమయంగా వుంది. ఇదంతా విన్న స్వప్న క్కూడా ఒక ప్రక్క విస్మయంగానూ, మరో ప్రక్క సంతోషంగానూ వుంది.


"ఇన్నాళ్ళకు కూతురి మీద మనసు కలిగినట్టు వ్నది" వెటకారంగా అంది అత్తగార్ని. పవన్ చిరాగ్గా స్వప్న వైపు చూసి లోనికి వెళ్ళిపోయాడు. మర్నాడు ప్రయాణం అనగా అన్నపూర్ణ దగ్గరికి వెళ్ళి తన ప్రయాణ విషయాన్ని చెప్పడంతో ఆమె "సంతో షంగా వెళ్ళండి" అంది ఈరకంగానైనా వసుంధర ప్రశాంతంగా వుంటుంది అని అనుకుంది.

*** *** ***

విజయవాడ ట్రైన్ కూత వేసింది బయలు దేరడానికి సిద్ధంగా. పంపించడానికి వచ్చిన పవన్ తల్లికి మళ్ళీ మళ్ళీ చెబుతున్నాడు "అమ్మా! నువ్వు వచ్చేముందు లెటర్ రాస్తే నేను వచ్చి రిసీవ్ చేసుకుంటాను" అన్నాడు. కొడుకును వదిలి వెళ్ళి పోతున్నందుకు వసుంధరకు ఓ పక్క బాధగానే వుంది. ట్రైన్ ప్లాట్‌ఫారమ్ దాటేవరకు పవన్ వైపు చూస్తూ చేయి వూపింది. ప్రక్కనే కూర్చున్న ఒక మధ్య వయస్కురాలు "ఏ వూరు వెడుతున్నారు?" అనడిగింది.

"విజయవాడ" అని చెప్పి అలసటగా కళ్ళు మూసుకుంది. నిద్ర పోవడానికి యత్నిస్తోంది. కోడలి ప్రవర్తనే కళ్ళ ముందు మెదలటంతో నిద్ర రాక ఆ ప్రయత్నం మానుకుని కొడుకు కొనిచ్చిన వార పత్రిక తీసి చదవ సాగింది. స్టేషన్లు వస్తున్నాయి. పోతున్నాయి. చదవటంలో లీనమై పోయింది. ఎదుట కూర్చున్నావిడ ఏవో ప్రశ్నలు వేసింది కాని సమాధానం కోసం రెండు మూడు సార్లు ప్రయత్నించి వూరుకుంది. ఇంతలో ఒక్క కుదుపుతో ట్రైన్ ఆగడంతో కళ్ళు తెరిచింది. విజ యవాడ జంక్షన్ వచ్చేసింది. సూట్‌కేస్, బ్యాగ్ పట్టుకుని డోర్ దగ్గరికి వచ్చి నిలబడింది. రణగొణ ధ్వనులతో వుంది ప్లాట్ ఫారమ్. ఇంతలో కూతురు సాహితి, అల్లుడు ఆనంద్ చేయి వూపుతూ కన్పించ డంతో ఆమె మనసు కుదుటపడింది. గుమ్మంలో తల్లిని చూసిన సాహితి చాలా సంబరపడింది.

'రామ్మా! చానాళ్ళకు వచ్చావు!"అంటూ కౌగి



లించుకుంది. "మొన్న నీవు రాసిన లెటర్ అందింది. నీవు వస్తున్నావని అందులో చదివి నమ్మలేకపోయాను" అంది సాహితి.

"పోనీలే ఇప్పటికైనా మీ అమ్మగారికి మన మీద దయ కలిగింది" అన్నాడు ఆనంద్ నవ్వుతూ. కూతురు, అల్లుడు సంభాషణకు తృప్తిగా అన్పిం చింది ఆమెకు.

ఈ నెల రోజుల్లో చాలా కోలుకుంది వసుం ధర. ప్రేమకు, ఆప్యాయతకు, అనురాగ పూరిత మాటలకు మూహమాచిపోయిన వసుంధర కూతురు, అల్లుడు సాహచర్యంలో మామూలు మనిషయ్యింది. కూతురు చేసే పనుల్లో సాయ పడబోతే "నీకెందుకు శ్రమ?" అంటూ వారించేది సాహితి. ఆనంద్ వారానికి రెండు,మూడు రోజులు క్యాప్‌కెడుతుంటాడు. ఆ సమయంలో సాహితి తన తల్లితో చిన్నప్పటి సంఘటనలను గుర్తు చేస్తూ సరదాగా కబుర్లాడుతూ కాలం గడి పేస్తోంది. ఆ రోజు పవన్ నుంచి వచ్చిన ఉత్తరం చూసి వసుంధర విచారంగా వుండిపోయింది.

"ఏమిటమ్మా అలా వున్నావు?" అంటూ సాహితి తల్లి చేతుల్లోని ఉత్తరం తీసుకుని చదివింది.

"అయితే నువ్వు అన్నయ్య దగ్గరకు వెళ్ళిపో తావా అమ్మా?" అని కూతురు ప్రశ్నించడంతో ఉలిక్కిపడి-

"నువ్వెళ్ళమంటే వెడతాను" అంది నవ్వుతూ.

"నా కోసం కాకపోయినా నీ మనవడికోసం నువ్విక్కడే వుండిపోవాలి!" అంది కాస్త సిగ్గుప డుతూ.

వసుంధరకి అర్థమై "నా తల్లే ఎంతటి శుభవార్త చెప్పావు!" అంటూ కూతురి నుదుటిపై ముద్దుపె ట్టుకుంది. దాంతో ఆమె మనసులో భారం పూర్తిగా దిగిపోయింది. సాహితి కూడా తల్లి తన దగ్గరే వుంటుందన్న సంతోషంతో వసుంధర వారిస్తున్నా వినకుండా చకచకా పనులు చేయసాగింది.

*** *** ***

ఆ రాత్రి పడుకున్న వసుంధరకు కొడుకింటి దగ్గర గడిపిన గతం గుర్తుకు వచ్చింది. 'తను ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపిందో? అశాంతితో ఎంత తల్లడిల్లిపోయిందో?. ఏ క్షణంలో కోడలు ఏ మాట అంటిస్తుందోనని విలవిల్లాడిపోయేది. మాట చంపుకుని, మనసు చంపుకుని జీవచ్ఛవంలా మంచంలో ఎలా పడి వుందో? అయినా ఈ వయ సులో తను కోరుకునేదేముంటుంది? కొంచెం ఆసరా, తోడు, ఒకింత ఆప్యాయత, కించిత్ ప్రేమ. అంతేగా! అందరూ వున్నా అన్నింటికి దూర మైనట్టు, తనకు తానే శిక్ష విధించుకున్నట్టు, అంతూ దరీ లేని ఒంటరి తనంతో ఎంత కుమిలి పోయింది? ఎంత తల్లడిల్లిపోయింది? ఈసడిం చుకునే కోడలు.. చూసీ చూడనట్టు హడావిడిగా ఆఫీసుకు పోయే కొడుకు.. సొంత ఇంటిలోనే పరాయి పంచన గడిపినట్టు..స్వాతంత్ర్యం కోల్పోయి నట్టు.. ఎంత మానసిక క్షోభ అనుభవించింది? ఆఖరి ప్రస్థానంలో ఏ ఘటమైనా కోరుకునేదేముం టుంది? భగవాన్! పగవాడిక్కూడా వద్దు అలాంటి నరకం! కొడుకైతే భార్య రావంత వరకే కొడుకు, కూతురైతే జీవితాంతం కూతురే' అంటూ ఆమె మనసులో సుండి తిరుగుతున్న ఆలోచనలకు ఒక నిట్టూర్పు రూపంలో ఫుల్‌స్టాప్ పడింది.

అన్నపూర్ణ గుర్తుకు రావటంతో వసుంధర మనసు ఆమె పట్ల కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. తనే తటస్థించకపోతే తన పరిస్థితి ఎండిన పండుటా కుకన్నా హీనంగా మారేది. నిజానికి తను ఇక్కడ ఆనందంగా వుండడానికి కారణం అన్నపూర్ణ. వెనకటి చాదస్తాలు వెన్నాడుతుంటే ఇన్నాళ్ళూ తను కొడుకు దగ్గరే వుండిపోయింది. సంప్రదాయాలే మనుగడకు ప్రతిబంధకాలైనప్పుడు వాటిని ఛేదించ డంలో తప్పు లేదని చెప్పి తన కళ్ళు తెరిపించిన అన్నపూర్ణ ఆమెకు నిజంగా దేవతగా తోచింది. మనసు ఇప్పుడు ప్రశాంతంగా, హాయిగా తేలిపో యినట్టుంది. రెండు జాములప్పుడు వసుంధర నిద్రలోకి జారుకుంది ఆనంద క్షణాలు మళ్ళీ వచ్చాయన్న ధీమాతో, మనవడి రాకతో అవి మరింత శాశ్వతమౌతాయన్న నిశ్చింతతో.